## కనీస వేతనాల చెల్లింపుకు సంబంధించిన చట్టం

(Minimum Wages Act. 1948)

వ్యవసాయరంగంలో వివిధ స్థాయిలలో పనులచేసే రైతు కూలీలకు కనీసవేతనాలను చెల్లించడానికై ప్రభుత్వం ఒక చట్టాన్ని రూపొందించింది. తాత్కాలిక వ్యవసాయకూలీలు, దైనందిన కూలీలు – దున్నుట/ పంటమార్చుట/విత్తనాలువేయుట, నార్లువేయుట,/కలుపుతీయుట/త్రవ్వుట / కుప్పవేయుట మొదలైన పనులు చేయుటకు కనీస వేతనాలను చెల్లించవలసిన యున్నది. అయితే ప్రభుత్వం ప్రకటించిన రేట్ల కంటే కూలీలకు, వాస్తవంగా, తక్కువ కూలీలు చెల్లించడం జరుగుచున్నది. అందువల్ల చట్టంలోని, నిబంధనలను, అమలు చేయుటకు ఇన్‌స్పెక్టర్ల హోదాలో పర్యవేక్షణ చేయుటకు - G.O.Ms.No.634 - of L.E. & T.E. - 13.6.1977 ద్వారా తహశీల్దారులకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు, అధికారాలు ఇవ్వడం జరిగింది. కాబట్టి మండల స్థాయిలోను, గ్రామస్థాయిలోనూ ఈ చట్టంలోని నిబంధనలను అమలు జరిగేట్టు చూడవలసిన బాధ్యత ఉంది.

# ది ఇండియన్ ట్రెజర్ - ట్రోవ్ చట్టం 1878
## (కేంద్ర చట్టం)

### 1. ముఖ్యోద్దేశ్యము:

'నిధి' అంటే చారిత్రాత్మక లేదా పురాతత్వ ప్రయోజనం కలిగి 100 సంవత్సరాలకు పైబడిన కాలం నుండి భూమిలో నిక్షిప్తమైవున్న, కప్పుబడి వున్న అంటి పెట్టుకొని ఉన్న రూ. 10/- మించిన విలువ కలిగియున్న ఏదైనా వస్తువు అని అర్ధము. అంతేకాకుండ, భూమి ఉపరితలంపై కనుగొన్న కోయని వజ్రాలు, ఇతర విలుపైన ఖనిజాలు కూడ 'నిధి' లో చేరి ఉంటాయి. అట్టి నిధిని కనుగొన్నప్పుడు భారత నిధి నిక్షేపాల చట్టం 1878 లోని నిబంధనల ప్రకారం చర్యతీసుకోవలసి ఉంటుంది.

### 2. ప్రచురణ:

చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం నిధిని కనుగొన్న వ్యక్తిగాని, కనుగొన్న వ్యక్తి నుండి నిధినికొనుగోలు చేసిన వ్యక్తిగాని, లేదా స్థలం యజమాని గాని, అనుభవదారుగాని 'నిధి'కి సంబంధించి కనుగొన్న వివరాలన్నిటిని 2 నెలలోగా జిల్లా కలెక్టరుకు తెలియజేయాలి. పైన పేర్కొన్న వ్యక్తులనుండి అట్టి సమాచారం అందిన మీదట సెక్షన్ 5 ప్రకారం కలెక్టరు ఒక నిర్ధిష్టమైన నాల్గు మాసాల కాలవ్యవధి చూపుచూ ఒకతేదీ, స్థలం, సమయంలో తన సమక్షంలో క్లైముదారులు హాజరురవడం కోసం నిధి వివరాలను స్టేటుగెజిట్ లోను, జిల్లా గెజిట్‌లోను, లోకల్ పోలీసు స్టేషనులోను, కలెక్టరు కార్యాలయంలోను, గ్రామంలోగల పంచాయితీ కార్యాలయలోను నోటీసు ప్రచురించడం ద్వారాను, గ్రామంలో దండోరా మూలము గాను ప్రకటించాలి. నిర్ణయించిన తేదీన క్లైమెంటులు హాజరు కాకపోతే సెక్షన్ 6 ప్రకారం వార్కి నిధిపై గల హక్కులను కోల్పోతారు.

### 3. విచారణ, ప్రకటన

క్లైయిము దార్లు కలెక్టరు వద్ద హాజరైనప్పుడు నిధి నిక్షిప్తతగురించి, వారి హక్కుల గురించి దర్యాప్తు నిర్వహించి, క్లైముదార్ల హక్కులు సివిల్ కోర్టు ద్వారా రుజువు చేసుకొనేందుకు సెక్షన్ 8 ప్రకారం అతనికి అవకాశం మరియు సమయం నిర్ధేశిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలి. సెక్షన్ 9 ప్రకారం, క్లైమెంటు లేకపోయినా, సెక్షన్ 8 ప్రకారం అనుమతించిన సమయంలో క్లైమెంటు సివిల్ కోర్టులో తన హక్కులు రుజువు చేసుకోవడానికి దావా వేయ్యకపోయినా, లేదా వేసిన దావాలో తీర్పు తనకు ప్రతికూలమైన నిధిని "యజమాని లేని నిధి" గా ప్రకటించాలి.

### 4. నిధి పంపకం:

"యజమాని లేని నిధి" గా ప్రకటించిన పిదప చట్టంలోని సెక్షన్ 10, 11 మరియు 12 ప్రకారం ఆయాక్లైము దార్లవాటాలను నిర్ధారించి, వాటాల నిష్పత్తి ప్రకారం "నిధి"ని, గాని దానికి సమానమైన విలువను గాని క్లైమెంట్లకు, కనుగొన్న వ్యక్తికి పంచియివ్వాలి.

**5. నిధి స్వాధీనము:**

"నిధి" పురాతత్వ లేదా చారిత్రాత్మక విలువైనదిగా భావించినట్లైతే ప్రభుత్వ ఉత్తర్వులను పొంది సెక్షన్ 16 ప్రకారము కలెక్టరు వారు నిధిని స్వాధీనంచేసుకోవచ్చు. పై 2వ పేరాలో తెల్పిన వ్యక్తులుగాక వేరొక వ్యక్తి "నిధి" గురించి ముందుగా సమాచారము అందించినచో, సెక్షన్ 16-ఎ ప్రకారము నిధిలో వాటాను పొందే వీలుంటుంది.

**6. శిక్ష:**

సెక్షన్ 20 ప్రకారము ఏదేని నిధిని కనుగోన్న వ్యక్తి లేదా కొనుగోలు చేసిన వ్యక్తి నిధి గురించి సెక్షన్ 4 ప్రకారం కలెక్టరు వార్కి సమాచారం తెలియజేయక పోయినా, నిధిని దాచినా, మార్చి వేయడానికి ప్రయత్నించినా, మార్చినా వారికి ఒక సంవత్సరం కారాగారము లేదా జరిమానా లేదా రెండింటితో శిక్షించడమవుతుంది.

అదే విధంగా అట్టినేరానికి స్థలయజమాని లేదా అనుభవదారు సహాయపడినా, ప్రోత్సహించినా, సమాచారం అందించకపోయినా అతనినికూడ 6 మాసాల కారాగారము లేదా జరిమానా లేదా రెండింటితో శిక్షంచడమవుతుంది.

**7. గ్రామ రెవెన్యూ అధికారి విధి**

గ్రామ రెవెన్యూ అధికారి తన గ్రామ పరిధిలో కనుగోన్న నిధి నిక్షేపాల గురించి పూర్తి వివరాలతో సంబంధిత తహశీల్దారు వార్కి తక్షణమే నివేదిక పంపాలి.

# శాంతి భద్రతలు

గ్రామంలో శాంతి భద్రతలు కాపాడడంలో పోలీసు రెవెన్యూ అధికారులకు పూర్తి సహకారం అందించడం గ్రామ రెవెన్యూ అధికారి ముఖ్య విధుల్లో ఒకటి.

1. గ్రామంలో ఏ విధమైన కుల, వర్గ, మత ఘర్షణలు జరిగినా లేక జరిగే సూచనలున్నా వెంటనే పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించే బాధ్యత గ్రామ రెవెన్యూ అధికారి.

2. గ్రామంలో ఏ హత్యలు జరిగినా, ఆత్మహత్యలు జరిగినా అనుమానాస్పద మరణములు సంబవించినా ఆ సందర్భాలలో కూడ వెంటనే పోలీసు, రెవెన్యూ అధికారులకు తెలియచేయాలి. పోలీసువారు వచ్చి విచారణ ప్రారంభించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొనే వరకు దాన్ని గ్రామ సేవకుల సహాయంతో ఆ ప్రదేశం నుండి కదిలించకుండా జాగ్రత్తలు తీసుకొవాలి. కేసు విచారణలో, శవ పంచాయితీలో పోలీసు వారికి సహకరించాలి. నేరం జరిగిన స్థలాన్ని యధావిధంగా పరిరక్షించాలి.

3. గ్రామంలో ఏ రోడ్డు ప్రమాదం సంభవించినా వేంటనే పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలి. క్షతగాత్రులకు తక్షణ ప్రాథమిక వైద్య చికిత్స జరిగేలా చూడాలి. వెంటనే వారిని దగ్గరలోవున్న వైద్యశాలకు పంపించాలి. ప్రమాదం జరిపిన వాహన చోదకణ్ణి, అతని వాహనాన్ని ప్రమాద స్థలం నుండి పోలీసువారు వచ్చేలోగా తప్పించుకుపోకుండా నిరోధించాలి. వాహనంలోని ప్రమాణీకులకు తక్షణ సహాయంగా ఆహారం, నీరు అందేటట్లు చూడాలి.

4. గ్రామంలో ఏ అగ్ని ప్రమాదం సంభవించినా వెంటనే అగ్నిమాపక సిబ్బంధికి, రెవెన్యూ,పోలీసులకు సమాచారం అందించాలి. ఫైర్ఇంజన్లు వచ్చేలోగా గ్రామస్థుల సహకారంతో మంటలు ఆర్పడానికి కృషి చేయాలి. అగ్ని బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు అన్ని చర్యలు తీసుకొవాలి.

5. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించుచున్నా, ఆశ్రయం పొందుచున్నా, ఆవిధంగానే ఎవరైనా విదేశీ పౌరులు గడువుదాటిన తర్వాత గ్రామంలో నివసించుచున్నా, ఎవరి ఆశ్రయంమైనా పొందుచున్నా వెంటనే పోలీసు వారికి తెలియచేయాలి.

6. గ్రామంలో ఏదైనా దొంగసొత్తు దొరికిన సందర్భాల్లో సదరు సొత్తును జాగ్రత్తగా పోలీసు వారికి అప్పగించవలెను. అదేవిధంగా ఎవరూ హక్కుదారులు లేని ఆస్తిని కూడ పోలీసువారి స్వాధీనములో ఉంచవలేను.

7. గ్రామంలో అపరాధులెవరైనా ఉన్న సందర్భాలలో పోలీసు వారికి సమాచారము అందించి తగు చర్య తీసుకొనవలెను.

8 రైలు ప్రమాదాలు, విమాన ప్రమాదాలు గ్రామ పరిధిలో జరిగిన సందర్భాలలో వెంటనే రెవెన్యూ పోలీసు అధికారులకు తెలియచేయాలి. క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయము అందించవలెను.

9. తహశీల్దారు, మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌గా క్రిమినల్ ప్రొసిజర్ కోడ్‌లోని కొన్ని నిర్ధిష్టమైన సెక్షన్ల క్రింద అనగా సెక్షన్లు 107, 129, 144, 145, 174 మరియు 176(3) వగైరాలు క్రింద శాంతి భద్రతల పరిరక్షణకు అధికారములను సంక్రమింపజేసినారు. ఈ విషయములో గ్రామ రెవెన్యూ అధికారి, తహశీల్దారు గారికి తగు సహకారము అందించవలెను.

# యఫ్.ఐ.ఆర్

## (సెక్షన్ 154 సి.ఆర్.పి.సి)

ఏదైనా నేరము జరిగినప్పుడుగాని లేదా జరుగుతుందని అనుమానించినపుడు గాని ఎవరైనా వ్యక్తి పోలీసు అధికారికి ఫిర్యాదు రూపంలో గాని, ఆరోపణల రూపములో గాని తెలియచేసినచో, అట్టి సమాచారమును యఫ్.ఐ.ఆర్ (ఫస్ట్ ఇన్‌ఫర్‌మేషన్ రిపోర్టు) అంటారు. అది కేసుకు పునాది వంటిది.

- అట్టి సమాచారము వ్రాసి ఇచ్చినచో ఆ వ్యక్తి దానిపై సంతకము చేయవలెను.
- ఏ కారణము వల్లనైనా అట్టి ఫిర్యాదు నోటి మాటగా ఇచ్చినదైతే, సదరు పోలీసు అధికారి ఫిర్యాదు వ్రాసి, ఆ వ్యక్తికి చదివి వినిపించి అతనిచేత సంతకం చేయించవలెను.
- ఆ ఫిర్యాదు సారాంశాన్ని స్టేషన్ రోజువారి డైరీలో వ్రాయవలెను.
- భాధితులుగాని, బాధితుల తరపువారుగాని యఫ్.ఐ.ఆర్. దాఖలు చేయవచ్చును.
- నేరము యొక్క పూర్తి వివరములు, నిందితుని యొక్క వివరములు మరియు గుర్తులు, నేరము జరిగిన స్థలము, తేది, సమయము, సాక్షుల వివరములు, ఏ ఉద్దేశముతో నిందితుడు ఆ నేరమునకు పాల్పడినది, మొదలగు వివరములు యఫ్.ఐ.ఆర్. నందు పొందుపరచవలెను.
- ఫిర్యాదు దారుడు యఫ్.ఐ.ఆర్. కాపీ పొందు హక్కు కలిగి ఉండును.
- పోలీసు అధికారి యఫ్.ఐ.ఆర్. రికార్డు చేయుటకు నిరాకరించినచో ఆ విషయమును తెలియజేస్తూ ఫిర్యాదు దారుడు ఫిర్యాదును జిల్లా పోలీసు సూపరింటెండెంటు (యస్.పి) గారికి పోస్టు ద్వారా పంపవచ్చును.
- సంబంధిత మేజిస్ట్రేటు గారి కోర్టులో కూడా క్రిమినల్ ప్రొసిజర్‌కోడ్ లోని సెక్షను 200 క్రింద ఫిర్యాదు దాఖలు చేయవచ్చును.
- సదరు మేజిస్ట్రేట్ వారు సంబంధిత పోలీసు అధికారిని, అట్టి ఫిర్యాదును దర్యాప్తు చేయవలసితదిగా ఆదేశించవచ్చును.
- తప్పుడు ఫిర్యాదు ఇచ్చుట నేరము
- పోలీసు వారు అసత్యపు ఫిర్యాదు (యఫ్.ఐ.ఆర్) వ్రాయుట కూడా నేరము.

# అరెస్టు - బెయిలు - హక్కులు

వ్యక్తిగత స్వేచ్ఛ భారత పౌరునికి రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు. కావున వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడం నేరము. అలా భంగం కలిగించిన వారు శిక్షార్హులు.

ప్రభుత్వంగాని, పోలీసులుగాని తగిన కారణం లేకుండా ఏ భారత పౌరున్ని నిర్బంధించరాదు. అట్లు ఏ వ్యక్తి అయినా నిర్బంధానికి గురైతే అట్టి వారికి సంబంధించిన వారెవరైనా సుప్రీం కోర్టును గాని రాష్ట్ర హైకోర్టును గాని ఆశ్రయించి విడుదల కోరవచ్చు. (Article 32 and Article 226 of Constitution) తగిన కారణం పై ఏ వ్యక్తినైనా నిర్బంధించినచో అట్టి వ్యక్తిని, ఆయా అధికారులు, 24 గంటల్లో సంబంధిత న్యాయ స్థానము ముందు ఖచ్చితంగా హాజరు పరచవలెను. అట్లు హాజరు పరచనిచో అది అక్రమ నిర్బంధమగును. కావున అందుకు కారకులైన అధికారులు శిక్షార్హులు, అలా అక్రమ నిర్బంధానికి గురైన వారికి సంబంధించిన వారు, ప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్ కోర్టునుగాని, జిల్లాకోర్టును గాని ఆశ్రయించి తగిన విడుదల ఆర్డరును గాని, అనువైన సందర్భాలలో సెర్చివారెంటుగాని పొందవచ్చును.

నిర్బంధించబడిన వ్యక్తికి, తనను ఎందుకు ఏ నేరంపై నిర్బంధిచినదీ తెలిసికొనే హక్కు కలదు. అలాగే నిర్బంధించిన అధికారి, అలా ఎందుకు నిర్బందించినదీ తెలుపు బాధ్యత కలిగి ఉండును. (Sec.50.Cr.P.C.) నిర్బంధించిన అధికారి నిర్బంధంలో ఉన్న వ్యక్తిని ఎలాంటి హింసలకు గురి చేయరాదు, అలా చేస్తే అది నేరము కాబట్టి అట్టి అధికారి శిక్షార్హుడు.

నిర్బంధంలోకి తీసుకోబడిన ప్రతి వ్యక్తినీ నేరస్తుడిగా భావించరాదు. ఆ వ్యక్తి పై అభియోగం రుజువైనప్పుడే శిక్షార్హులవుతారు. తగిన విచారణ లేకుండా ఏ వ్యక్తినీ, శిక్షించరాదు, కావున విచారణ అయ్యేంతవరకూ స్వేచ్ఛగా ఉండటానికి బెయిల్ కోరవచ్చు. వారు న్యాయసహాయం పొందడానికి అర్హులు.

సాధారణంగా చిన్నతరహానేరాలలో, కేసు విచారణ సమయంలో బెయిలుపై విడుదల అగుటకు వీలుండవచ్చు (Sec.49.Cr.P.C.). అయితే విచారణ సమయంలో న్యాయస్థానం ముందు ప్రతివాయిదాకు హాజరవుతానని న్యాయస్థానం అంగీకారం మేరకు జామీనుదారులతో సహా పూచీ కత్తు ఇవ్వవలసి ఉంటుంది. బెయిలు పొందిన ముద్దాయి పరారైనచో పూచీ ఉన్న జామీనుదారులు, పూచీ కత్తులో ఉదహరించిన సొమ్ము కోర్టుకు చెల్లించాల్సి ఉంటుంది.

తీవ్రమైన ప్రమాదకరమైన నేరాలలో నిర్బంధించబడిన వ్యక్తులు కూడా బెయిలుపొందే అర్హత కలిగి ఉంటారు. (Sec.437.Cr.P.C.) కాని అట్టి కేసులలో కేసుపై విచారణ జరిపిన మీదట కోర్టువారు బెయిలు ఇచ్చుటగాని నిరాకరించుటగాని చేయవచ్చు. నేరం మోపబడిన ముద్దాయి విచారణకు తప్పకుండ హాజరవుతాడని, సాధారణంగా న్యాయస్థానం పరిధి నుండి పారిపోయే అవకాశం లేదనీ, సాక్షులను తారుమారు చేయరని భావించినప్పుడు మాత్రమే అతనిని బెయిలు పై విడుదల చేస్తారు.

ఏ పౌరుడైనా అన్యాయంగా గాని, అకారణంగా గాని తనను నిర్బంధంలోనికి తీసుకోబోతున్నారని గ్రహించినపుడు, అతడు అమాయకుడైతే సెషన్స్ కోర్టునుగాని హైకోర్టును గాని ఆశ్రయించి ముందస్తు బెయిలు పొందవచ్చును.

గౌరవ సుప్రీంకోర్టువారు ఒక తీర్పులో చెప్పిన క్రింద విషయములు, పోలీసు వారు ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు, తప్పక పాటించవలసియున్నది.

1. అరెస్టు కాబడిన వ్యక్తి కోరినచో అతని/ఆమెయొక్క స్నేహితునికి గాని, బంధువులకు గాని, పరిచయస్తునికి లేదా వారి హితులకు గాని ఆ వ్యక్తిని అరస్టు చేసినట్లు మరియు ఎక్కడ నిర్బంధములో ఉంచుచున్నదీ పోలీసు వారు తెలుపవలెను.

2. పోలీసు వారు, అరస్టు చేసిన వ్యక్తి పై గల హక్కును వారు ఆ వ్యక్తికి తెలుపవలెను.

3. అట్టి అరెస్టు గురించి ఎవరికి తెలిపినదీ, పోలీసు వారు స్టేషను డైరీలో వ్రాయవలెను.

# సమాచార హక్కు చట్టం - 2005

ఈ చట్టం 21-06-2005 నుండి అమలులోనికి వచ్చినది. జమ్మూకాశ్మీరు రాష్ట్రం మినహా దేశమంతటికీ ఈ చట్టం వర్తిస్తుంది.

1. **ప్రస్తావన :** ప్రతి ప్రభుత్వాధికార వర్గం పనితీరులో పారదర్శకతను, జవాబుదారి తనాన్ని పెంపొందించడానికి వీలుగా, ప్రభుత్వ అధికారుల నియంత్రణ క్రింద గల సమాచారాన్ని పొందడానికి రూపొందించిన సమాచార హక్కుకు సంబంధించిన ఆచరణీయ పరిపాలనా క్రమాన్ని పౌరులకు వివరించడం.

   కేంద్ర సమాచార కమీషనను, రాష్ట్ర సమాచార కమీషన్లను ఏర్పాటు చేసేందుకు, అందుకు సంబంధించిన విషయాలకు కార్యక్రమాలకు వీలు కల్పించడం.

2. **"సమాచార హక్కు"** అనగా ఏ అధికార యంత్రాంగం నియంత్రణ కింద ఉన్న సమాచారాన్నయినా ఈ చట్టం కింద పొందగలిగే హక్కు, పనులనూ, పత్రాలనూ, రికార్డులనూ తనిఖీ చేసే హక్కు రికార్డులలో ఉన్న సమాచారాన్ని ఎత్తి రాసుకోవడం, వాటి నకలలు, సర్టిఫైడ్ కాపీలు తీసుకోవడం, సమాచారం సంపత్తి సర్టిఫైడ్ శాంపిళ్ళు తీసుకోవడం, డిస్కెట్లు, ఫ్లాపీలు, టేపులు, వీడియో క్యాసెట్ల రూపంలో లేక మరే విధమైన ఎలక్ట్రానిక్ సమాచారాన్ని పొందటం అలాంటి సమాచారం కంప్యూటరులో గాని, మరే విధమైన పరికరములోగాని నిక్షిప్తమై ఉంటే ప్రింట్ అవుట్ల ద్వారా దానిని పొందటం కూడ ఈ హక్కులో భాగం.

3. **"సమాచారం"** అనగా రికార్డులు, పత్రాలు, మెమోలు, ఇ-మెయిల్స్ అభిప్రాయాలు, సలహాలు, పత్రికా ప్రకటనలు, సర్కులర్స్, ఉత్తర్వులు, లాగ్‌బుక్స్, కాంట్రాక్టులు, నివేదికలు, పేపర్లు, శాంపిల్స్, మోడల్స్, డేటా సహా ఎలక్ట్రానిక్ రూపంతో పాటు ఏ రూపంలోనైనా వున్న సమాచారం. అమలులో ఉన్న మరే చట్ట ప్రకారమైన, ప్రభుత్వ యంత్రాంగం సంపాదించదగిన ఏ ప్రైవేటు సంస్థకు సంబంధించిన సమాచారమైన ఈ చట్ట ప్రకారం సమాచారమే.

4. **"రికార్డు"** అనగా ఏదైనా పత్రం వ్రాత ప్రతి ఫైలు, ఏదైనా మైక్రో ఫిల్మ్, మైక్రోఫిష్ (ఫైలు చేయడానికి వీలైన మైక్రోఫిల్మ్), పత్రం ఫాక్సిమిలి ప్రతి, అలాంటి మైక్రో ఫిల్ముల నుంచి, తీసిన చిత్రం లేక చిత్రాలు (అదే సైజులో గాని, పెద్దవిగా చేసి గానీ), కంప్యూటర్ లేదా మరేదైనా పరికరము ద్వారా ఉత్పత్తి అయ్యే సమాచార సంపత్తి.

**5. చట్ట పరిధిలోనికి వచ్చునవి :**

అన్ని అధికార యంత్రాంగాలు ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. కేంద్ర ప్రభుత్వం నెలకొల్పిన, నిర్ధిష్టమైన కొన్ని, ఇంటిలిజెన్స్, సెక్యూరిటీ సంస్థలు, ఆ సంస్థలు ప్రభుత్వానికి అందించిన సమాచారం మాత్రం ఈ చట్ట పరిధిలోకి రావు.

అధికార యంత్రాంగం అంటే, రాజ్యాంగం కింద లేదా రాజ్యాంగం ద్వారా, పార్లమెంటు రూపొందించినా ఏ చట్ట ప్రకారమైన, రాష్ట్ర శాసన సభలు రూపొందించిన మరే చట్టం ప్రకారమైన, సముచిత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ లేదా ఉత్తర్వు ద్వారా ఏర్పాటైన ప్రభుత్వ స్వపరిపాలన సంస్థలు, సముచిత ప్రభుత్వం, సొంతమైన, నియంత్రణలో వున్న లేదా గణనీయంగా నిధులు పొందుతున్న సంస్థలు, ప్రత్యక్షంగాను, పరోక్షంగాను, సముచిత ప్రభుత్వము నుండి గణనీయంగా నిధులు అందుకుంటున్న ప్రభుత్వేతర సంస్థలు కూడ అధికార యంత్రాంగం కిందికే వస్తాయి.

**6. అధికార యంత్రాంగం - విధులు :**

ప్రభుత్వ సంస్థకు సంబంధించిన రికార్డులన్నింటిని కాటలాగ్ - ఇండెక్స్ చేసి, కంప్యూటరైజ్ చేసి, అన్ని ప్రదేశాలలో లభించే రీతిలో నెట్ వర్కు ద్వారా అనుసంధానము చేయాలి.

సంస్థ వివరాలు, అమలు పరుస్తున్న కార్యక్రమాలు, నిర్వహిస్తున్న విధులు, ఉద్యోగుల అధికారాలు - బాధ్యతలు, నిర్ణయాలు తీసుకునే విధానం, పర్యవేక్షణ జవాబుదారీ మార్గాలు, విధుల నిర్వహణలో అమలులో వున్న నియమ నిబంధనలు బహిర్గతం చేయాలి.

**7. పౌరునకు సంక్రమించే హక్కులు :**

ఎటు వంటి సమాచారమైన పౌరుడు పొందగలిగే హక్కు

- పనులనూ, పత్రాలనూ, రికార్డులనూ, తనిఖీచేసే హక్కు
- పత్రాలు, రికార్డులలో వున్న సమాచారాన్ని ఎత్తి రాసుకోవడం, వాటి నఖళ్ళు సర్టిఫైడ్ కాపీలు పొందే హక్కు
- ప్రింటౌట్లు, డిస్కెట్స్, ఫ్లాపీలు, వీడియో క్యాసెట్ల రూపంలో లేక మరే విధమైన ఎలక్ట్రానిక్ రూపంలో సమాచారం పొందే హక్కు.

**8. సమాచారం కోసం దరఖాస్తు చేయు విధానం :**

ఈ చట్టం కింద సమాచారాన్ని కోరదలుచుకున్న వారు ఆంగ్ల భాషలో లేక హిందీలో లేక స్థానిక అధికార భాషలో రాత పూర్వకముగా లేక ఎలక్ట్రానిక్ రూపంలో నిర్ణీత రుసుముతో పాటు తమ

అభ్యర్థనను దాఖలు చేయాలి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి నుంచి రుసుము వసూలు చేయడానికి వీలు లేదు. సమాచారము కోరుతున్నవారు లిఖిత అభ్యర్థన ఇవ్వలేని పక్షంలో మౌలికంగా వారు చేసిన అభ్యర్థనను, రాతలో పెట్టేందుకు, కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి, యుక్తమై సహాయమంతా వారికి అందించాలి.

- సమాచారం కోరుతున్న దరఖాస్తుదారు ఎవరైనా అందుకు గల కారణం ఏమిటో వివరించాల్సిన అవసరము లేదు. తనకు కబురుచేసేందుకు అవసరమైన మినహా ఎలాంటి వ్యక్తి గత వివరాలు కూడ సమర్పించాల్సిన పని లేదు.

**9. రుసుము చెల్లించవలసిన విధానం :**

సమాచారం కోసం దరఖాస్తు చేసినప్పుడు దానితో పాటు నిర్ణీత రుసుము చెల్లించాలి. దరఖాస్తు పాటు రుసుం కింద నగదు గానీ, డి.డి.గానీ, బ్యాంకర్స్ చెక్ గాని అందజేయవచ్చును. రాష్ట్రం పరిధిలో సమాచారం పొందేందుకు చెల్లించాల్సిన రుసుము వివరాలు

- గ్రామ స్థాయిలో రుసుము లేదు
- మండల స్థాయిలో 5 రూపాయలు
- ఆ పై స్థాయిలో 10 రూపాయలు
- ప్రచురణలు, ముద్రణలు, ప్రతులు, మ్యాపులు, ప్లానులు, ఫ్లాపీలు, సీడిలు, శాంపిల్స్, మాడల్స్ ఇతరత్రా రూపంలో ఉన్న ఏ సమాచారమైన కోరినప్పుడు దానికి నిర్ణయించిన ధర చెల్లించాలి.

**నిర్ణీత ధరలేని సందర్భంలో**

- ఎ-4 లేక ఎ-3 సైజు ప్రతికి పేజికి 2 రూపాయలు
- అంత కన్నా పెద్ద సైజు ప్రతి అయినప్పుడు ఆ కాగితం ధర
- మ్యాప్‌లు, ప్లాన్ల అసలు ఖర్చు
- 1.44 ఎం.బి సైజు ఫ్లాపీకి 50 రూపాయలు
- 700 ఎం.బి. సైజు సిడికి 100 రూపాయలు
- డి.వి.డి.కి 200 రూపాయలు
- శాంపిళ్ళకు అసలు ఖర్చు
- రికార్డుల తనిఖీకి మొదటి గంటకు రుసుము లేదు. ఆ పై ప్రతి 15 నిమిషాలకు 5 రూపాయలు
- పోస్టులో సమాచారం పంపాల్సి వచ్చినప్పుడు అసలు రుసుముకు అధనంగా పోస్టేజి ఛార్జీలు చెల్లించాలి.

**10. పౌర సమాచార అధికారుల నియామకం :**

అధికార యంత్రాంగం కింద ఉన్న అన్ని కార్యాలయాలలో ఈ చట్టం ప్రకారం సమాచారం కోరే ప్రశ్నలకు సమదానం అందించడం కోసం పౌర సమాచార అధికారులను నియమించుటము జరిగింది. సక్రమ విధి నిర్వహణ కోసం పౌర సమాచార అధికారి ఆ కార్యాలయంలోని మరో అధికారి సహాయం కోరినప్పుడు ఆ సహాయం అందించాలి. ఈ చట్టంలోని నిబంధనల ఉల్లంఘన కిందకు రాకుండా ఉండేందుకు అలాంటి సహాయం అందించే అధికారులను కూడా పౌర సమచార అధికారులుగా పరిగణిస్తారు.

**11. పౌర సమాచార అధికారి విధులు :**

- సమాచారం కోసం వచ్చిన ప్రతి అభ్యర్థననూ పౌర సమాచార అధికారులు పరిశీలించాలి. సమాచారం కోరుతున్న పౌరులకు సహేతుకమైన సహాయం అందించాలి.
- దరఖాస్తు చేయడానికి పౌరులకు సహాయపడాలి.
- ఒక వ్యక్తి తెలియని తనంతో ఒక శాఖకు సంబంధించిన అంశాన్ని మరో శాఖకు దరఖాస్తు చేసినా అది అందుకొన్న పౌర సమాచార అధికారి ఆ దరఖాస్తును సంబంధిత శాఖకు బదిలీ చేసే దరఖాస్తుదారునికి తెలియచేయాలి.
- పౌర సమాచార అధికారి సమాచారం కోరిన వ్యక్తికి వీలైనంత త్వరగా లేదా 30 రోజుల్లో సమాచారం విధిగా అందించాలి. లేదా చట్టంలోని సెక్షన్ 8 లేదా 9 ప్రకారం నిరాకరించిన విషయాన్నైనా తెలియజేయాలి.
- వ్యక్తి ప్రాణానికి స్వేచ్ఛకు అవసరమైన సమాచారము 48 గంటలలోగా తెలియజేయాలి.
- పౌర సమాచార అధికారి నిర్ణీత సమయంలో సమాచారం అందజేయకుంటే అది నిరాకరణ కిందకే వస్తుంది.
- ఒక వేళ సమాచారం నిరాకరించినట్లయితే ఆ విషయాన్ని దరఖాస్తు దారుడికి తెలయజేసి, దానికి కారణాలు పేర్కొనాలి. అదే విధంగా ఈ నిర్ణయంపై అపీలు చేసుకునే గడువు, ఎవరికి అప్పీలు చేయాలో వివరంగా తెలియజేయాలి.

**12. జరిమాన విధించుట**

ఏదేని ఫిర్యాదుపై లేదా అప్పీలుపై నిర్ణం తీసుకునే సమయంలో ఏవిధమైన కారణం లేకుండా, ప్రభుత్వ సమాచార అధికారి సమచారం కోసం దరఖాస్తును స్వీకరించడానికి నిరాకరించిన లేదా నిర్ణీత సమయంలోపల సమాచారాన్ని అందజేయ లేకపోయినా లేదా సమాచారం కోసం అభ్యర్థనను దురుద్దేశముతో నిరాకరించిన లేదా ఉద్దేశ పూర్వకముగా తప్పుడు సమాచారాన్ని మరియు అసంపూర్తి

సమాచారాన్ని ఇచ్చినా లేదా సమాచారాన్ని తప్పుదోవ పట్టించినా లేదా అభ్యర్థన ముఖ్యమైన అంశముగా ఉన్నట్టి సమాచారాన్ని నాశనము చేసినా, లేదా సమచారాన్ని అందజేయడంలో ఏదేని ఒక రీతిలో అడ్డుకున్నాడని సమాచార కమీషను అభిప్రాయ పడినట్లయితే మొత్తం రూపాయలు 25,000/-లకు మించకుండా దరఖాస్తు అందేంతవరకు లేదా సమచారము తెలియజేసేంత వరకు రోజుకు 250 రూపాయల చొప్పున జరిమానా విధించవచ్చును.

**13. అప్పీలు :**

1. నిర్దేశించిన కాలపరిమితి లోగా జవాబు దొరకని వ్యక్తి ఎవరైనా, లేక కేంద్ర, పౌర సమాచార అధికారి లేదా రాష్ట్ర పౌర సమాచార అధికారి తీసుకున్న నిర్ణయంతో అసంతృప్తి చెందిన వారైనా ఆ కాలపరిమితి ముగింపు తరువాత లేక నిర్ణయం అందిన తరువాత 30 రోజులలోగా అప్పీలు చేసుకోవచ్చు. కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారికి, సంబంధిత అధికార యంత్రాంగంలో సీనియర్ హోదాలో ఉన్న అధికారికి ఆ అప్పీలును నివేదించాలి. అప్పీలు అధికారి నిర్ణయంపై రెండవసారి అప్పీలు చేయదలిస్తే అ నిర్ణయం తీసుకుని ఉండాల్సిన తేది నుండి కానీ నిర్ణయం అందిన రోజు నుంచి కానీ 90 రోజులలోగా కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ ముందు అప్పీలుకు వెళ్ళవచ్చు. కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి నిర్ణయంపై వచ్చిన అప్పీలు తృతీయ పక్షానికి చెందిన సమాచారానికి సంబంధించినదయితే కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ ఆ తృతీయ పక్షానికి తమ వాదన వినిపించేందుకు తగిన అవకాశం ఇవ్వాలి.

**14. కేంద్ర, రాష్ట్ర సమాచార కమీషన్లు ఏర్పాటు :**

1. ఈ చట్టం కింద సంక్రమించాల్సిన అధికారులను వినియోగించేందుకూ, అప్పగించిన కార్యాలను నిర్వహించేందుకూ కేంద్ర ప్రభుత్వం, కేంద్ర సమాచార కమీషన్‌ను ఏర్పాటు చేస్తుంది. ఆ సంస్థలో కేంద్ర ప్రధాన సమాచార కమీషనర్, పదిమందికి మించకుండా కేంద్ర, సమాచార కమీషనర్లు ఉంటారు. వీరిని ప్రధాన మంత్రి నాయకత్వములోని ఒక కమిటీ సిఫారసుల మేరకు రాష్ట్రపతి నియమిస్తారు. ఆ కమిటీలో లోకసభ ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి ఎంపిక చేసిన కేంద్ర మంత్రి సభ్యులుగా ఉంటారు.
2. అదే విధంగా ప్రతి రాష్ట ప్రభుత్వమూ రాష్ట్ర సమాచార కమీషన్‌ను ఏర్పాటు చేస్తుంది. ఆ సంస్థలో రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ 10 మందికి మించకుండా సమాచార కమీషనర్లు ఉంటారు. వీరిని ముఖ్య మంత్రి నాయకత్వంలో ఒక కమిటీ సిఫారసుల మేరకు గవర్నరు నియమిస్తారు. ఆ కమిటీలో శాసన సభలో ప్రతి పక్షనేత, ముఖ్యమంత్రి ఎంపిక చేసిన క్యాబినెట్ మంత్రి సభ్యులుగా ఉంటారు.

**వాటి విధులు :**

ఏ పౌరుడైనా ఫిర్యాదు ఇచ్చినప్పుడు దానిని స్వీకరించి విచారణ జరపడం కేంద్ర, రాష్ట్ర సమాచార కమీషన్ల విధి. ఆ ఫిర్యాదుల సందర్భాలు :

- నిర్ణీత కాల పరిమితి లోపల సమాచారం కోసం లేదా సమాచారాన్ని అందించడం కోసం అభ్యర్థనకు సమాధానం ఇవ్వని పక్షంలో.
- సమాచారం కోసం వచ్చిన దరఖాస్తునో, అప్పీలును స్వీకరించినప్పుడు.
- ఈ చట్టం కింద అభ్యర్థించిన సమాచారాన్ని అందించేందుకు నిరాకరించిన పక్షంలో
- ఈ చట్టం కింద సమాచారం కోసం ఇచ్చిన అభ్యర్థనకు నిర్దేశించిన కాల పరిమితిలోగా జవాబురాని పక్షంలో.
- సమాచారం కోసం చెల్లించాల్సిన రుసుము సహేతుకంగా లేదని దరఖాస్తుదారు భావించిన పక్షంలో
- ఈ చట్టం కింద తనకు అసంపూర్తిగా, తప్పు దోవ పట్టించే విధంగా, తప్పుడు సమాచారం అందించారని దరఖాస్తుదారు భావించిన పక్షంలో
- ఈ చట్టం కింద సమాచారాన్ని కోరడం రికార్డులను అందుబాటులో ఉంచడానికి సంబంధించిన మరే ఇతర విషయాలలోనైనా.

ఫిర్యాదుపై లేక అప్పీలుపై కేంద్ర సమాచార కమీషన్ లేక రాష్ట్ర సమాచార కమీషన్ నిర్ణయం తీసుకునే సమయంలో, కేంద్ర పౌర సమాచార అధికారి లేక రాష్ట్ర పౌర సమాచార అధికారి సరైన కారణం లేకుండా దరఖాస్తును స్వీకరించలేదని భావించినా, తగిన కారణం లేకుండా సెక్షన్ 7 లోని సబ్ సెక్షన్ (1) కింద నిర్దేశించిన కాలపరిమితిలోపు సమాచారం అందించ లేదని భావించినా, సమాచారం కోసం అభ్యర్థనను దురుద్దేశంతో తిరస్కరించారని భావించినా, లేక తెలిసికూడ తప్పుడు, అసంపూర్తి, తప్పుదోవపట్టించే సమాచారం అందించారాని భావించినా, అభ్యర్థనలో కోరిన సమాచారాన్ని ధ్వంసం చేశారని భావించినా, మరే విధంగా నైనా సమచారం అందకుండా అడ్డు పడ్డారని భావించినా, దరఖాస్తును స్వీకరించేంత వరకూ లేక సమాచారం అందించేంత వరకూ రోజుకు 250 రూపాయల చొప్పున జరిమానా విధించవచ్చు. మొత్తం మీద ఆ జరిమానా 25 వేల రూపాయలకు మించకూడదు.

## 15. కోర్టుల పరిధి

ఈ చట్టం కింద వెలువడిన నిర్ణయాలపై దావాలను దరఖాస్తులను స్వీకరించే అధికారం సివిల్ కోర్టులకు లేదు.